సత్వర పరిష్కారమే లక్ష్యం...
సమస్యలపై సమరం!




పటాన్‌చెరు ఆర్సీపురం సర్కిల్‌లో కాలనీ సంక్షేమ సంఘాలతో సమావేశమైన ఆయా విభాగాల అధికారులు

- ప్రజలతో అధికారుల ముఖాముఖి
- నేటి నుంచి కాలనీల్లో సమీక్ష నిర్వహించనున్న అధికారులు
- సమస్యలు తెలుసుకోనున్న ఐదు విభాగాల అధికారులు
- సద్వినియోగం చేసుకోవాలి: జోనల్ కమిషనర్ శంకరయ్య

మీ కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లుతుందా... వీధి దీపాలు వెలగడం లేదా... రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయా... ఫిర్యాదులు చేసినా ఎవరూ స్పందించడం లేదా... అయితే నేడు అధికారులే మీ వద్దకు వస్తున్నారు. సమస్యలు తెలియజేస్తే పరిష్కారం చూపిస్తారు.

గచ్చిబౌలి: జీహెచ్ఎంసీలో ఇప్పటికే మొదలైన (కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ అండ్ సిటిజన్ గ్రీవియన్స్ డిస్పోసల్ ప్రోగ్రాం, ఒక్క మాటలో చెప్పాలంటే కాలనీ కాంటాక్ట్ అని కూడా పిలువొచ్చు. జీహెచ్ఎంసీ, జలమండలి, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు, టీఎస్‌పీడీసీఎల్ అధికారులు కాలనీ సంక్షేమ సంఘాలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లతో సమావేశమవుతారు.

- ఆయా కాలనీల ప్రజలు సమావేశానికి హాజరై తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టి తీసుకువెళ్లాలి. సమస్యలను గుర్తిస్తూ చెక్ లిస్ట్‌ను తయారు చేసి సంబంధిత అధికారులు సంతకాలు చేసి ఇస్తారు. అధికారులు గుర్తించిన సమస్యలను ఆయా విభాగాల సమన్వయంతో అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి ప్రణాళిక రూపొందిస్తారు.
- శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలోని పటాన్‌చెరు సర్కిల్ పరిధిలో ఇప్పటికే కాలనీ కాంటాక్ట్ ప్రారంభమైంది.
- శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిల్ పరిధిలో సోమవారం నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని జోనల్ అధికారులు తెలిపారు. వెస్ట్ జోనల్ పరిధిలోని నాలు సర్కిళ్లలో మొత్తం 539 కాలనీలు ఉండగా యూసుఫ్‌గూడలో 98, శేరిలింగంపల్లిలో 216, చందానగర్‌లో 168, ఆర్సీపురం పటాన్‌చెరులో 57 కాలనీలు ఉన్నాయి.

సమస్యల గుర్తింపు ఇలా...

- జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చే చెత్త, నిర్మాణ వ్యర్థాల తొలగింపు, గ్రీన్ వేస్ట్ గుర్తించడం, మొక్కలు నాటడం, పబ్లిక్ టాయిలెట్ల నిర్వాహణ,పార్కులలో వాకింగ్ ట్రాక్‌ల తీరు, రోడ్లపై గుంతలు, వీధి దీపాలు, నాలా సేఫ్టీ అంశాలు, మ్యాన్ హోల్స్ సమస్య, దోమల బెడద తదితర సమస్యలపై చర్చిస్తారు.
- జలమండలి పరిధిలోకి పైప్‌లైన్ లీకేజీ, మంచి నీటి సరఫరాలో తేడాలు, మొక్కలకు నీళ్లు, వరదలు, వాటర్ లాగింగ్ పాయింట్ల గుర్తింపు, చెరువు కాలుష్యం తదితర అంశాలలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుంటారు.
- పోలీసు విభాగం పరిధిలోకి వచ్చే జూదం, గంజాయి, డ్రగ్స్ దందాలు, ఈవ్ టీచింగ్, పబ్లిక్ ఏరియాలో మద్యం తాగడం తదితర సమస్యలను గుర్తిస్తారు.
- ఫీవర్ కేసులు, ఇతర వ్యాధులపై వైద్య ఆరోగ్య శాఖ ఆరా తీస్తుంది.

పరిష్కారం ఇలా...

- డ్రైనేజీ, పైప్ లైన్ లీకేజీ, వెలగని వీధి దీపాలాంటి సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరిస్తారు. సమస్యల పరిష్కారానికి నిధులు అవసరం అయితే అవకాశాలను బట్టి పరిష్కరిస్తారు. నిధులు అవసరమున్న సమస్యలే ఎక్కువగా దృష్టికి వచ్చే అవకాశం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి...



ఐదు విభాగాల అధికారులు కాలనీలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లతో సమావేశమవుతారు. ప్రజలు తెలిపిన సమస్యలను చెక్ లిస్ట్ తయారు చేసి అధికారులు, కాలనీ సంఘాల నాయకులు సంతకాలు చేస్తారు. మా దృష్టికి వచ్చిన సమస్యలను ఎంత మేరకు పరిష్కరించామో కొద్ది రోజుల్లోనే తెలుస్తుంది. నిధులు అవసరమున్న సమస్యల పరిష్కారానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంటుంది. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు కాలనీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కానున్నారు. ఆయా కాలనీలకు ఇప్పటికే నోడల్ అధికారులను నియమించాం.

– శంకరయ్య, కమిషనర్, వెస్ట్ జోనల్

రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రమణ

అట్టహాసంగా బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

శంషాబాద్: దేశంలోనే సీఎం కేసీఆర్ పాలన అత్యుత్తమమైనదని ఎమ్మెల్సీ రమణ అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పట్టణంలోని వైఎస్ఆర్‌గార్డెన్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు వారి జీవితాల్లో నిర్మాణాత్మకమైన మార్పులకు దోహదం చేస్తున్నాయన్నారు. దళితుల సంక్షేమానికి కనీవిని ఎరుగని రీతిలో పథకాలు కొనసాగుతున్నాయన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలే వెన్నుముక అని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. కార్యకర్తల శ్రేయస్సుకోసం పార్టీ నిరంతరం పనిచేస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం బీఆర్ఎస్ పాలనలోనే సాధ్యమైందని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతి పక్షాల వెన్నుల్లో వణుకు పుట్టిస్తున్నాయన్నారు. హ్యాట్రిక్ పాలనకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, జెడ్పీటీసీ తన్వీ, ఎంపీపీ జయమ్మ, నార్సింగి ఏఎంసీ చైర్మన్ డీ.వెంకటేష్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్. గణేష్‌గుప్తా, పార్టీ మండల అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి, కౌన్సిలర్లు అజయ్, మేకల వెంకటేష్, వై.కుమార్, జహంగీర్‌ఖాన్, అశోక్, భారతమ్మ, లక్ష్మీ, లావణ్య నాయకులు శ్రీనివాస్, మురళి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

రేవంత్ రెడ్డి పరామర్శ..



రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

మణికొండ: టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి కోకాపేటకు వచ్చారు. ఆదివారం కోకాపేటలోని మగదా గేటెడ్ కమ్యూనిటీలో నివసిస్తున్న సత్యనారాయణరెడ్డి తండ్రి ఇటీవల మరణించారు. దీంతో ఆదివారం రేవంత్‌రెడ్డి ఆయనను పరామర్శించారు. అనంతరం ఆయన నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ పీసీసీ ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కౌన్సిలర్ దుర్గేష్‌యాదవ్, నాయకులు రాము, ఓంప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల నూతన గదుల నిర్మాణానికి భూమిపూజ



డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, ట్రస్ట్ సంస్థ సీఈఓ నిర్మాల్ తదితరులు

బండ్లగూడ: శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాల తరగతి గదులతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు దాతల సహకారంతో నూతన గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆదివారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హైదర్షాకోట్‌లోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 240 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కాగా.. గతంలో నిర్మించిన 6 తరగతి గదులు ఉన్నాయి. వాటిలో 3 శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా వాటిని తొలగించి నూతనంగా గదులను నిర్మించేందుకు ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ సంస్థ, రౌండ్‌టేబుల్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నూతన గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, ట్రస్ట్ సంస్థ సీఈఓ నిర్మల్, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, లక్ష్మి, ప్రసన్నాంబ, అనిత, రాజరాజేశ్వరి, అనురాధ, తదితరులున్నారు.



క్లుప్తంగా...

వీరాంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మధుబన్ కాలనీ వీరాంజనేయ స్వామి దేవాలయం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం కాలనీలోని గణేష్ మండపంలో మధుబన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డీ.వీ. కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏ.గోవిందరాజు, ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్, కోశాధికారిగా సందీప్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. సామల సతీష్, మెడికల్ శ్రీను, ఆంజనేయులు, సతీష్, నాని, టింకు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత

మంత్రి చామకూర మల్లారెడ్డి



ప్రతినిధులకు మెమెంటోను అందిస్తున్న మంత్రి మల్లారెడ్డి

రాయదుర్గం: విద్యావంతులైతేనే ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. నానక్‌రాంగూడలోని షరటాన్ హోటల్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్, పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్, మెటామోర్ఫోసిస్ ఆధ్వర్యంలో 'హైదరాబాద్ టుడే కాంక్లేవ్' కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ... ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్యాసంస్థల్లో నూతన విద్యా విధానంపై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ టుడే కాంక్లేవ్ పేరిట సదస్సులు పెట్టడం, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలని, ప్రతి విద్యా సంస్థలో నాణ్యమైన విద్యతోపాటు నైపుణ్యాలు కూడా విద్యార్థులు నేర్పించేలా చూడాలన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్‌నారాయణ మాట్లాడుతూ... నూతన విద్యావిధానాన్ని దేశవ్యాప్తంగా అవలంభించవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా నూతన విద్యా విధానంపై అందరిలోనూ అవగాహన ఏర్పడడానికి అవకాశం ఉంటుందన్నారు. పల్లవి గ్రూప్ స్కూల్స్ చైర్మన్ మల్కా కోమురయ్య మాట్లాడుతూ... ఎన్ఈపీ–2020 విధాన ంపై మరింతగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గుర్తించి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. హెచ్‌టీసీ కో ఫౌండర్ మల్కా యశస్వి ద్వారా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను విడుదల చేశారు. డీపీఎస్ సీనియర్ ప్రిన్సిపాల్ సునీతారావు, 450 పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

షేక్‌పేట్ సూర్యనగర్ కాలనీ పార్కుకు బహుమతి



ఉత్తమ పార్కు బహుమతి అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

గోల్కొండ: కాలనీ సంక్షేమ సంఘాల వారు తమ కాలనీలలో పార్కులు అభివృద్ధి చేయడానికి ముందుకు రావాలని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. 7వ గార్డెన్ ఫెస్టివల్‌లో సూర్యనగర్ కాలనీలోని పార్కుకు మొదటి బహుమతి వచ్చిన సందర్భంగా ఈ అవార్డును ఆదివారం మంత్రి నిరంజన్‌రెడ్డి సూర్యనగర్ కాలనీ ప్రతినిధి ఆసీఫ్ హుస్సేన్ సోహెల్‌కు అందజేశారు. బల్దియా జోనల్ కమిషనర్‌తో పాటు ఉద్యానవన శాఖ అధికారులు, పారిశుద్ధ్య విభాగం జలమండలి అధికారుల సహకారం వల్లే పార్కుకు బహు మతి వచ్చిందని ఈ సందర్భంగా సోహేల్ అన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

అబిడ్స్: బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే కేసీఆర్ అభినందన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పేరు నామకరణం చేయడంతో ఈనెల 21న కేసీఆర్‌కు కృతజ్ఞతత సభ నిర్వహిస్తున్నట్లు బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు కొమ్ముల నరేందర్ తెలిపారు. అభినందన సభ పోస్టర్‌ను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కొమ్ముల నరేందర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పూసల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, విప్లవ గాంధీ, ఆరెపల్లి రాజేందర్, రత్నాకర్, దుగ్ని సాయికృష్ణ, గంధం రాములు పాల్గొన్నారు.


వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



జర్నలిస్ట్ యూనియన్ సభ్యులను సన్మానిస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

రాజేంద్రనగర్: వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఉంటుందని మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు తమ సేవలను అందిస్తున్నారన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన రాజేంద్రనగర్ సర్కిల్ ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నూతన కార్యవర్గం ఆదివారం మంత్రి సబితాఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను శాలువాతో సన్మానించి ఆమె అభినందించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ జర్నలిస్టులను ప్రభుత్వ పరంగా ఆదుకోవడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రంగారెడ్డి జిల్లా దాడుల నివారణ కమిటీ సభ్యులు ఏ.భీమయ్య, ఏ.పీ.చారి, నూతన కమిటీ అధ్యక్షులు ఎం.దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు షేక్ నిజాముద్దీన్, చందు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రేమ్‌రాజ్, జాయింట్ సెక్రటరీ మహేష్, లక్ష్మణ్ సెక్రటరీ యాదగిరి, పబ్లిసిటీ సెక్రటరీ చంద్రకాంత్, కోశాధికారి ఎస్.విజయ్ కుమార్, సహాయ కోశాధికారి ఇంద్రసేన, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీనివాస్, సలహాదారులు సూర్యకిరణ్, బాబురావు తదితరులున్నారు.

నీటి వృథాను అరికట్టండి!



మణికొండ క్వార్టర్స్ వద్ద వృథాగా పోతున్న క్యాండూట్ నీరు

మణికొండ: ప్రజలకు ఓ వైపు రోజు విడిచి రోజు సరఫరా చేయాల్సిన నీటిని పలుమార్లు రెండ్రోజులకు ఓసారి సరఫరా చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. బోర్లు వట్టిపోవటం, జలమండలి సరఫరా చేస్తున్న నీరు ఏమాత్రం సరిపోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితిలో రోజూ వేలాది లీటర్ల నీరు వృథాగా పోతుండటాన్ని చూసి మణికొండ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గండిపేట చెరువు నుంచి క్యాండూట్ ద్వారా నీరు ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్‌కు చేరుకుని అక్కడ శుద్ధి జరిగి నగరంలోని అనేక ప్రాంతాలకు జలమండలి నీటిని సరఫరా చేస్తోంది. దీనిలో భాగంగా మణికొండ మున్సిపాలిటీ మీదుగా ఉన్న క్యాండూట్‌కు పలుచోట్ల లీకేజీలు ఏర్పడి వేలాది లీటర్ల నీరు 24 గంటలు వృథాగా పోతోందని ఆరోపణలున్నాయి. మణికొండ క్వార్టర్స్ సంప్ వద్ద ప్రతి రోజూ నీరు వృథాగా పోతుండటాన్ని ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. నీటిని వృథా చేసే బదులుగా క్యాండూట్‌లో కొంత తక్కువ సరఫరా చేయాలని వారు సూచిస్తున్నారు. ఇకనైనా జలమండలి ట్రాన్స్‌మిషన్ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకుని లీకేజీలను అరికట్టడం, నీటి సరఫరాకు లీకేజీలు లేకుండా చేసి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీస్ అకాడమీలో కల్చరల్ డే సెలబ్రేషన్స్



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

బండ్లగూడ: తెలంగాణ పోలీస్ అకాడమీలో 'అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ కల్చరల్ డే' సెలబ్రేషన్స్‌లో భాగంగా రాణి రుద్రమదేవిసభ మందిరంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. సామాజిక సమస్యలపై శిక్షణకు ఫన్నీ స్కిట్స్, సోలోసాంగ్స్, ఉర్దూ కవితలు వినిపించి ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకున్నారు. టీఎస్‌పీఏ డైరెక్టర్ సందీప్‌శాండిల్యకు ప్రాసిక్యూటర్స్‌కు విలువైన శిక్షణ అందించినందుకు ఏపీలు డైరెక్టర్‌ను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సాంస్కృతిక ప్రదర్శనలో డైరెక్టర్ సందీప్‌శాండిల్య, జాయింట్ డైరెక్టర్ నవీన్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ అనసూయ, రాదేశ్ మురళీ, రాఘవరావు, శ్రీరామమూర్తి, లా అసిస్టెంట్ డైరెక్టర్లు రాజేశ్వరరావు, డేనియల్, అసిస్టెంట్ డైరెక్టర్లు రవీందరెడ్డి, మనోహర్, రమణ, శ్రీదేవి, భోపాల్, వి.శ్రీనివాసరావు, డీఎస్పీలు శ్రీనివాస్ రావు, వెంకటరమణారెడ్డి, కృష్ణ, యూనిట్ మెడికల్ ఆఫీసర్ రమాదేవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా భ్రమరాంబామల్లికార్జునుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు, భక్తులు

శేరిలింగంపల్లి: వేదపండితుల మంత్రోచ్చరణలు... భక్తుల జయజయ ధ్వానాలతో నల్లగండ్ల ప్రాంతంలోని భ్రమరాంబికామల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణం దద్దరిల్లింది. ఆదివారం ఆలయ ప్రాంగణంలో వైభవంగా భ్రమరాంబికామల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆలయాన్ని మామిడిఆకులు, పూలు, విద్యుత్ దీపాలతో నేత్రపర్వంగా అలంకరించారు. ఉదయం స్వామివారిని, అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, అలంకారం వంటి పూజలను నిర్వహించారు. నల్లగండ్ల పరిసర ప్రాంతాలలోని భక్తులు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించి పరవశించిపోయారు. ఉత్సవాలను మాదాపూర్, హఫీజ్‌పేట్ కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, పూజితాగౌడ్ పర్యవేక్షించారు.

- నల్లగండ్లలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవంలో రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖా మంత్రి కేటీ రామారావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వివేకానంద, ఎమ్మెల్సీలు ఎస్.రమణ, ఎం.ఎస్.ప్రభాకర్, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కార్పొరేటర్లు మంజులా రఘునాథ్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్ ఉప్పలపాటి శ్రీకాంత్, గంగాధర్‌రెడ్డి, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బీఆర్ఎస్ నాయకులు, నల్లగండ్ల, పరిసర ప్రాంత ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

నానక్‌రాంగూడలో గడపగడపకూ బీజేపీ

రాయదుర్గం: అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రజామద్దతుతో ఘన విజయం సాధిస్తామని బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా నానక్‌రాంగూడలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పాదయాత్ర నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ సిద్ధాంతాలు, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో అన్ని వర్గాల ప్రజలకు మార్పు అవసరమని భావిస్తున్నారని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ప్రస్తుతం బీజేపీ నాయకులతో అధికారులను కలిసి కాలనీ, బస్తీల వారీగా సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరిస్తామన్నారు. శేరిలింగంపల్లిని నగరంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడం కోసం చిత్తశుద్ధితో పని చేస్తామన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు మా దృష్టికి తీసుకొస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా, గచ్చిబౌలి డివిజన్ నాయకులు, వివిధమోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి



యువకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: బంగారు తెలంగాణ నిర్మాణం కోసం యువత భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. ఆదివారం కొండాపూర్ డివిజన్‌కు చెందిన పలువురు యువకులకు కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పనులు, ఉపాధి అవకాశాలను చూసి యువత బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ కోసం పని చేసిన వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నేతలు లోకేష్ కుమార్, కిరణ్, సంతోష్, వెంకటచారీ, వంశీ కృష్ణ, పవన్, అజయ్, ముర్గేష్, గోపాల్, రాజు, నారాయణ పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ



రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్

బండ్లగూడ: సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నారని ఇందులో భాగంగానే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్ అన్నారు. 1వ డివిజన్‌లోని గంధంగూడ 'మజీద్ ఈ- రహమతుల్ అల్ ఆమోన్' మసీదులో రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ పర్వదినం సందర్భంగా రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. వీటిని ప్రజలంతా సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలన్నారు. మస్తాన్‌బాబు, మియా, మహ్మద్, ఫసీయుద్దీన్, రషీద్, సలీం, శ్రీనివాస్‌నగర్ కాలనీ ప్రెసిడెంట్ నాగేష్, లక్ష్మణ్, రాజు, జయప్రకాష్, నారాయణ తదితరులున్నారు.

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆవరణలోని మజీద్ వద్ద సోమవారం రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్నట్లు రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్‌లు అన్నారు. రాజేంద్రనగర్ సీనియర్ నాయకులు ముర్తుజాఅలీ, డివిజన్ ఉపాధ్యక్షులు ముజమ్మిల్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నవజ్యోతి యూత్ క్లబ్ మసీద్ వద్ద ఈ కానుకల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్‌లు హాజరై కానుకలను పంపిణీ చేస్తారని సమాచారం.